క్లుప్తంగా

మేధో సంపత్తి హక్కులపై అవగాహన



ప్రొఫెసర్ పురుషోత్తంను సత్కరిస్తున్న అధ్యాపకులు

గాజువాక: మేధో సంపత్తి హక్కులపై స్థానిక చైతన్య మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ పురుషోత్తం విద్యార్థులకు వివిధ అంశాలను విపులంగా వివరించారు. యువత తాము కనిపెట్టిన కొత్త అంశాలను సమాజ, దేశ, ప్రపంచ అభివృద్ధిలో భాగం చేసే ప్రక్రియను క్షుణ్ణంగా తెలియజేశారు. ఈ సందర్భంగా పేటెంట్ హక్కులు, ట్రేడ్ మార్కుల చట్టం, కాపీరైట్ చట్టాలకు సంబంధించిన విషయాలను వివరించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంతర్ విభాగ క్రికెట్ పోటీల విజేత బ్లాస్ట్‌ఫర్నేస్



విజేతగా నిలిచిన బ్లాస్ట్‌ఫర్నేస్ జట్టు క్రీడాకారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అంతర్ విభాగ క్రికెట్ పోటీల్లో బ్లాస్ట్‌ఫర్నేస్ (బీఎఫ్) జట్టు విజేతగా గెలుపొందింది. ఉక్కు స్టేడియంలో మూడు రోజులుగా పోటీలు జరుగుతున్నాయి. బీఎఫ్, ఎస్ఎంఎస్ జట్లు ఫైనల్ పోరులో తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన బీఎఫ్ జట్టు 31.3 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఎంఎస్ జట్టు 140 పరుగులకే ఆలౌట్ కావడంతో బీఎఫ్ జట్టు 39 పరుగుల తేడాతో విజయం సాధించింది. జట్టు క్రీడాకారులను సీజీఎం ఆర్. మొహంతి, జీఎం బి. కృష్ణారావు, చక్రవర్తి, పి.వి. నగేష్ అభినందించారు.

20న అప్రెంటిస్‌షిప్ మేళా

పెదగంట్యాడ: ఐటీఐలో వివిధ ట్రేడులను పూర్తి చేసుకున్న విద్యార్థుల కోసం ఈ నెల 20న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నామని ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీ ప్రిన్సిపాల్ లండా సుధాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీలో ఆ రోజు ఉదయం 9.30 గంటలకు మేళా ప్రారంభం కానుందని, మొత్తం 12 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటాతో పాటు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు రెండు సెట్లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు http://www. apprenticeshipindia.gov.in/mela నందు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలోని అప్రెంటిస్ సెక్షన్‌లో సంప్రదించవచ్చన్నారు.

దత్తత విద్యార్థులకు సామగ్రి పంపిణీ



సరకులు, పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెదగంట్యాడ: బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ద్వారా అమెరికాకు చెందిన షేక్ చాంద్ పాషా చేస్తున్న సేవలు అభినందనీయమని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్ అన్నారు. పాఠశాలలో చదువుతున్న, తల్లిదండ్రులు లేని 15 మంది విద్యార్థులను పాషా దత్తత తీసుకుని, ప్రతి నెలా వారికి అవసరమైన వస్తువులను సమకూర్చుతున్నారు. ఇందులో భాగంగా ఈ నెలకు సంబంధించి రూ.8వేల విలువైన నిత్యావసర వస్తువులు, పుస్తకాలను విద్యార్థులకు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.కిరణ్, నారాయణరావు, సుగుణ, రమేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



పాత గాజువాకలోని ఓ కళాశాల వద్ద గుమిగూడిన విద్యార్థులు



పరీక్ష కేంద్రం వద్ద క్యూలైన్‌లో విద్యార్థులు

గాజువాక: గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గాజువాక పట్టణ పరిధిలోని పది కేంద్రాల్లో పరీక్షలను నిర్వహిస్తున్నారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద సెక్షన్ 144 అమలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా ప్రథమ చికిత్స అందించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద ఆశ కార్యకర్తలను కూడా అందుబాటులో ఉంచారు. ప్రతీ కేంద్రంలో సగటున 350 మంది చొప్పున ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న సుమారు మూడు వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్టు అధికార వర్గాల సమాచారం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఇరుకు రోడ్డులో అవస్థలు

పాతగాజువాక దరి చైతన్యనగర్‌లో ఇంటర్ పరీక్షల కోసం నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడి కళాశాలలన్నీ ఒకే వరుసలో ఉండడం, ఆ కళాశాలలకు వెళ్లేందుకు రోడ్డు పది అడుగులకు మించి లేకపోవడంతో ట్రాఫిక్ గజిబిజిగా మారింది. ఈ కారణంగా బుధవారం పరీక్షలకు హాజరు కావాల్సిన విద్యార్థులు కొద్దిసేపు ఆందోళనకు గురయ్యారు. విద్యార్థులను వారి తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాలకు తీసుకొచ్చారు. వారి వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కోవడంతో విద్యార్థులు ట్రాఫిక్‌లోనే వాహనం దిగిపోయి పరుగున వెళ్లాల్సి వచ్చింది. పరీక్షలకు ఉదయం 8.30 గంటలకల్లా విద్యార్థులు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. తొమ్మిది దాటితే పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని అధికారులు ముందుగానే ప్రకటించడంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పలేదు. సందుల్లో ఉన్న కళాశాలలకు సుమారు వెయ్యి మంది విద్యార్థులు ఒకేసారి హాజరు కావడం, అదే రోడ్డులో సుమారు 12 కాలనీలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు ఆ సమయంలోనే తమ విధులకు బయల్దేరడం, అక్కడే ఉన్న పలు స్కూళ్లకు విద్యార్థులు కూడా వచ్చే సమయం కావడంతో ట్రాఫిక్ ఒక్కసారిగా స్తంభించిపోయింది. ఏటా ఇదే పరిస్థితి ఉంటున్నా, అధికారులు, నిర్వాహకులు కనీసం పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

17మంది గైర్హాజరు

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం పరిధిలోని నారాయణ జూనియర్ కాలేజీ (02167) పరీక్ష కేంద్రంలో మొత్తం 403 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 386 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. మొదటి రోజు తెలుగు పేపర్‌కు నలుగురు, సంస్కృతం పేపర్‌కు 13 మంది గైర్హాజరయ్యారు.

నలుగురు గైర్హాజరు

పెదగంట్యాడ: స్థానిక వినాయకనగర్ వుడా కాలనీలోని చైతన్య కళాశాలలో నిర్వహించిన ఇంటర్ పరీక్షలకు మొత్తం 413 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షల సందర్భంగా కళాశాల వద్ద సందడి నెలకొంది. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా రావడంతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది.



పెదగంట్యాడ : చైతన్య కాలేజీ వద్ద విద్యార్థుల సందడి



కూర్మన్నపాలెం: పరీక్ష కేంద్రాల వద్ద వేచి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న అక్కిరెడ్డిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక, సిబ్బంది



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్, సిబ్బంది

గాజువాక: టీబీపై అవగాహన కల్పిస్తూ గాజువాక పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బంది బుధవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆరోగ్య కేంద్రం వద్ద ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ వై.రామకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే ఆస్పత్రిలో చూపించుకోవాలన్నారు. సమీపంలోని పీహెచ్‌సీలలో ఈ పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులను కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టీబీ నోడల్ అధికారి డాక్టర్ కనక అప్పారావు, సీహెచ్‌వో నాగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

అక్కిరెడ్డిపాలెం: ప్రతీ ఒక్కరు క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం పీహెచ్‌సీ డాక్టర్ ఎ.ప్రియాంక అన్నారు. క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో బుధవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ టీబీ వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ద్వారా అనేక చర్యలను చేపడుతోందన్నారు. ప్రతీ ఆరోగ్య కేంద్రంలో టీబీ పరీక్షలు నిర్వహించి, వ్యాధి గ్రస్తులకు ఉచితంగా మందులను అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, ఎంపీహెచ్ఈవో ఎస్.ఎస్.వి.ఎన్.రాజు, హెల్త్ సూపర్‌వైజర్ కె.కిషోర్ కుమార్, సచివాలయాల ఏఎన్ఎంలు, కార్యదర్శులు, పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, ఆశ వర్కర్లు, జెడ్పీ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీబీ ముక్తభారత్ లక్ష్యం

పెదగంట్యాడ: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 2025 నాటికి క్షయ వ్యాధి నివారణ దేశమే లక్ష్యంగా పని చేస్తున్నామని జిల్లా టీబీ సెంటర్ వైద్యాధికారులు డాక్టర్ కె.సత్యవేణి, డాక్టర్ జి.మానస అన్నారు. టీబీ ముక్త భారత్ సైకిల్ ర్యాలీ కార్యక్రమంలో భాగంగా పెదగంట్యాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మన పంతం–టీబీ అంతం అనే నినాదంతో సాగిన ఈ ర్యాలీలో వైద్యాధికారులు మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా క్షయతో బాధపడుతున్న వారికి పౌష్టికాహారం నిమిత్తం ప్రతి నెలా రూ.500 చొప్పున ప్రతి ఆరు నెలలకోసారి వారి ఖాతాలకు జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పి.భూలక్ష్మి, వి.అనిల్ కుమార్, శ్రీనివాసరావు, తనకాల సత్యనారాయణ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

దేవాడ పీహెచ్‌సీ వద్ద..

జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని దేవాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్షయపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కృపాళిని, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

బ్యాడ్మింటన్ క్రీడాకారుడు లింగేశ్వరరావుకు వీడ్కోలు

ఉక్కునగరం: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు లింగేశ్వరరావుకు ఉక్కు అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. స్టీల్‌ప్లాంట్ క్రీడా ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న లింగేశ్వరరావు ఉద్యోగానికి రాజీనామా చేశారు. దీంతో ఉక్కు స్టేడియంలోని క్రీడా విభాగంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ కె.హెచ్.ప్రకాష్, మాజీ జీఎం ఎం.ఎస్. కుమార్ హాజరై లింగేశ్వరరావుకు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేశారు. వారు మాట్లాడుతూ లింగేశ్వరరావు అంతర్జాతీయ స్థాయిలో సాధించిన విజయాలు స్టీల్‌ప్లాంట్‌కు గర్వకారణమన్నారు. ఆయన భవిష్యత్తు ప్రణాళికలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం అధికారులు అమిత్ ఘడాయ్, మురళీమోహన్, కె. శ్రీనివాసరావు, కాశీ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



లింగేశ్వరరావును సత్కరిస్తున్న సీజీఎం ప్రకాశ్, మాజీ జీఎం కుమార్

762వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



స్టీల్‌ప్లాంట్ దీక్ష శిబిరం వద్ద నిరసన తెలియజేస్తున్న పెన్షన్‌దారులు

కూర్మన్నపాలెం: ఉక్కు సంకల్పంతో నిర్విరామంగా కొనసాగుతున్న ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 762వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన డబ్ల్యూఎం 1, 2 విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈపీఎస్ 95 పెన్షన్‌దారులు తలపెట్టిన దేశవ్యాప్త నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్థానిక పెన్షన్‌దారులు రిటైర్డ్ ఉద్యోగి అప్పారావు ఆధ్వర్యంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ అధికారి దృష్టికి సమస్యలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని ఉక్కు శ్రామిక సంఘం నాయకులు కేంద్ర కార్మిక శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.ఎస్. మధును కోరారు. స్టీల్‌ప్లాంట్‌కు బుధవారం విచ్చేసిన మధును నాయకులు కలిసి, సమస్యలను వివరించారు. మూడు నెలలుగా నిర్వాసిత కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని, చాలామందికి పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించడం లేదని చెప్పారు. కర్మాగారం కోసం భూములు, ఇళ్లు కోల్పోయి కాంట్రాక్ట్ కార్మికులుగా ఉపాధి పొందుతున్నారని, వారికి ఉక్కు యాజమాన్యమే నేరుగా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బొడ్డు పైడిరాజు, కరణం సత్యారావు, బి. శివరాజేష్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర కార్మికశాఖ అధికారి మధుకు సమస్యను వివరిస్తున్న నాయకులు

తైక్వాండో జాతీయ పోటీలకు మధురవాడ క్రీడాకారులు

మధురవాడ: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు మధురవాడకు చెందిన 10 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల యలమంచిలిలో సబ్ జూనియర్ క్యాడెట్ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. వీటికి మధురవాడ నుంచి 14 మంది క్రీడాకారులు హాజరుకాగా 10 మంది బంగారు, ఒకరు కాంస్య పతకం సాధించారు. వీరిలో 10 మంది ఈ నెల 28 నుంచి 31 వరకు రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మధురవాడ యూత్ తైక్వాండోకు చెందిన జి.భాషిత, ఎ.నిత్యశ్రీ, పి.జ్ఞానశ్రీ, కె.ధనలక్ష్మి, కె.మహేశ్వరరావు, పి.సుధీర్, ఎన్.విశాల్, పి.జశ్వంత్ సాయిసూర్య, ఎ.వివేక్ అభిసాయి, టి.మణికంఠ బంగారు పతకాలు గెలుచుకున్నారు. పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మధురవాడకు చెందిన శ్రీ కనక దుర్గా క్యాటరింగ్ అండ్ సప్లయిర్స్ నిర్వాహకులు కొర్రాయి సురేష్ ఆర్మ్ గార్డ్స్, చికెన్ గార్డ్స్ బుధవారం బహూకరించారు. విజేతలను మధురవాడ యూత్ తైక్వాండో కోచ్‌లు సురేష్, సుకుమార్, సంపత్ తదితరులు అభినందించారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అతిథులు, కోచ్‌లు

భెల్ కార్మికుల ఆందోళన

అక్కిరెడ్డిపాలెం: భెల్ యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు బుధవారం ఆందోళన చేపట్టాయి. యూనియన్ అధ్యక్షుడు అలమండ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భెల్ యాజమాన్యం ఎస్ఐపీ, పీపీపీలను ఉద్దేశపూర్వకంగానే అమలు చేయడం లేదని ఆరోపించారు. త్వరలోనే జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి, వీటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 8 గంటల పనిదినాల అమలు చేయాలని, మౌలిక వసతులను మెరుగుపరచాలని కోరారు. సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, భద్రతా పరికరాలు సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాహు, పి.వి.ఎన్.రాజు, నవీన్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమా వారోత్సవాలు ప్రారంభం

గాజువాక: గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్లకోమా వారోత్సవాలను ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ వై.రామకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో 45 ఏళ్ల దాటిన స్త్రీ పురుషుల కళ్లకు గ్లకోమా ప్రధాన సమస్యగా ఉందన్నారు. కంటికి ఎక్కువ ఒత్తిడి ఇవ్వడం వల్ల కొంత కాలానికి చూపు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. దీనిపై ప్రతి ఒక్కరూ ముందుగానే మేల్కొని, సరైన చర్యలను తీసుకోవడం ద్వారా కళ్లను రక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మ, సీహెచ్‌వో నాగ అప్పారావు, వివిధ విభాగాల సిబ్బంది సరళా ధనలక్ష్మి, పి.సురేష్, జి.రాణి, స్వామి తదితరులు పాల్గొన్నారు.



గ్లకోమా వారోత్సవాలను ప్రారంభిస్తున్న వైద్యాధికారి రామకృష్ణ

నిరుపేదలకు పింఛన్ల పంపిణీ

అగనంపూడి: సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు అండగా నిలుస్తున్న దాతల సహకారం ఎనలేనిదని ట్రస్ట్ వ్యవస్థాపకులు గుడే సుశీలా గజేంద్రరావు అన్నారు. 85వ వార్డు పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 75 మంది నిరుపేద వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు పట్టా రామ అప్పారావు, అధ్యక్ష, కార్యదర్శులు గంధోళి నరసింగరావు, శీరంశెట్టి గోవిందరావు, ప్రతినిధులు పాల్గొన్నారు.



పేదలకు పింఛన్లు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

సెయిల్‌లో విలీనంతో స్టీల్‌ప్లాంట్‌కు భవిష్యత్

ఎంపీలకు ఉక్కు అధికారుల సంఘం లేఖలు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా సెయిల్‌లో విలీనం చేస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ప్రైవేటీకరణ తప్పదని ప్రకటించిన నేపథ్యంలో బుధవారం సీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో లోకసభ, రాజ్యసభ ఎంపీలకు పెద్ద సంఖ్యలో లేఖలు రాశారు. ఆ లేఖల్లో ప్రైవేటీకరణ ప్రత్యామ్నాయం, సెయిల్‌లో విలీనం, వాటి ఉపయోగాలు, ఉక్కు పరిశ్రమ అభివృద్ధి, కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ లక్ష్య సాధన, ఉద్యోగాల కల్పన, రిజర్వేషన్లు అమలు వంటి అంశాలను వివరించారు. తక్కువ పెట్టుబడితో ఉక్కు సామర్థ్యం పెంపు గురించి లేఖల్లో వివరించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ మాజీ డైరెక్టర్ (ఆపరేషన్స్) కె.కె.రావు మాట్లాడుతూ విశాఖ ఉక్కుతో ఆంధ్రులకు చాలా అనుబంధం ఉందన్నారు. సెయిల్ నుంచి విడదీసిన విశాఖ ఉక్కును తిరిగి విలీనం చేయడం ద్వారా లాభదాయకమైన ఉత్పాదనకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సీ ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్, ఉపాధ్యక్షులు చంద్ర వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి నరసింహతోపాటు పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఎంపీలకు రాసిన లేఖలను ప్రదర్శిస్తున్న మాజీ డైరెక్టర్ రావు, సీ ప్రతినిధులు

వృర్థాలకు నిప్పు అంటుకుని అగ్నిప్రమాదం

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ బీ బ్లాక్‌లో బుధవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పరిశ్రమ వ్యర్థాలకు ఆకతాయిలు నిప్పు అంటించడంతో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. దీనిపై ఆటోనగర్ అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఆటోనగర్ బీ బ్లాక్‌లోని శ్రీ శివ సాయి ఐరన్ ట్రేడర్స్‌కు చెందిన వేస్ట్ మెటీరియల్‌ను శ్రీ విజయ దుర్గా టెస్టింగ్ ట్రెయినింగ్ ఇంజినీరింగ్ వర్క్స్ భవనం పక్కన డంప్ చేశారు. బుధవారం సాయంత్రం సమయంలో డెబ్రిస్ నుంచి భారీగా అగ్నికీలలు ఎగసిపడ్డాయి. పరిసర ప్రాంతాల్లో ఉన్న వారు ఆటోనగర్ ఐలా సిబ్బందికి తెలియజేయడంతో, వారు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఏడీఎఫ్‌వో పి.వి. రమణ ఆదేశాల మేరకు సిబ్బంది స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆకతాయిలు వ్యర్థాల నుంచి ఐరన్‌ను సేకరించడానికి ఇలాంటి చర్యలకు పాల్పడి ఉంటారని సిబ్బంది తెలిపారు. ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం కానీ, ఆస్తినష్టం గానీ జరగలేదని చెప్పారు.



ఆటోనగర్ బీ బ్లాక్‌లో ఒక పరిశ్రమ పక్కన చెత్త అంటుకుని ఎగసిపడుతున్న అగ్ని కీలలు

వినియోగదారులు హక్కులు తెలుసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ ఈడీ చినబాబు, సీఆర్‌వో ప్రతినిధులు

ఉక్కునగరం: పౌరులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించాలని ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చినబాబు అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం కన్జ్యూమర్ రైట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (సీఆర్‌ఓ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మరియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉక్కునగరంలో జరిగిన కార్యక్రమంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ వినియోగదారులకు తమ హక్కులు తెలియకపోవడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. వినియోగదారుల హక్కుల కోసం కృషి చేస్తున్న ఆర్గనైజేషన్ ప్రతినిధులను అభినందించారు. అనంతరం హక్కులపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌వో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్. రవీంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు ఎ.రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఎం.నగేష్, సంయుక్త కార్యదర్శి కలపాల బాబు తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు నివాళి

కూర్మన్నపాలెం: బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కూర్మన్నపాలెం ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వుడానగర్ ఫేజ్–1లోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టీల్‌ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (వర్క్స్) డి.వసంతరావు హాజరయ్యారు. కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు, పెంటారావు, చిట్టిబాబు, రమేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.